
www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 1 మార్చి 2024



శ్రీ చైతన్యలో ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్ పో



పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మండపేట

తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో నేషనల్ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోను మండల విద్యాశాఖాధికారులు నాయుడు రామచంద్రరావు, సోమిరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్‌లో సోలార్ వాటర్ సిస్టమ్, బయో డ్రైవర్ సిటీ, రోబో, డ్రిప్ ఇరిగేషన్ మోడరన్ అగ్రికల్చర్, మైక్రోస్కోప్ మోడల్, వాటర్ హార్వెస్టింగ్ , హైడ్రాలిక్ లిఫ్ట్, వాటర్ కంజర్వేషన్ సిస్టమ్, హైడ్రో ఎలక్ట్రిక్ - పవర్ స్టేషన్ తదితర ప్రాజెక్ట్ లు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ, సి.ఇంఛార్జిసతీష్, డీన్అరుణ్, కోఆర్డినేటర్ కిరణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా బరిలో నిలిచేదెవరో ?

- అమలాపురం ఎంపీ సీటు కోసం జనసేన, టిడిపిలో పెరిగిన ఆశావాహులు
- వైసిపి నుంచి రేసులో గొల్లపల్లి సూర్యారావు
- సిట్టింగ్ ఎంపీ అనురాధకు కేటాయింపుపై అనుమానం?



చింతా అనురాధ



గొల్లపల్లి సూర్యరావు



హరీష్ మాథూర్



డిఎంఆర్ శేఖర్

ప్రజాశక్తి- రాజోలు

రానున్న సార్వత్రిక ఎన్నికలు టిడిపి చావోరేవో లాంటివి. కచ్చితంగా నెగ్గి తీరాల్సిందే. లేకుంటే మరో అయిదేళ్ల వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉంటుంది. అందుకే ప్రతి ఒక్క తెలుగు తమ్ముడూ పార్టీ గెలుపు కోసం శ్రమిస్తు న్నాడు. తప్పనిసరిగా ఈ ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబు పూర్తిస్థాయిలో లోకేశ్‌కు బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్నారు.

అభ్యర్థి ఎంపికే కీలకం

అభ్యర్థుల ఎంపికే సగం విజయం సాధించినట్లు చెబుతారు పెద్దలు. ఎందుకంటే పార్టీకి ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నా సరైన అభ్యర్థిని నిలబెట్టకుంటే జనం ఓట్లు వేయరు. కచ్చితంగా అభర్థి గుణగణాలతోపాటు రాజకీయ నేపథ్యం, సామాజిక సమీకరణం అన్నీ బేరీజు వేసుకుని అభ్యర్థులను నిలపాల్సి ఉంటుంది. వైసిపి ఇప్పటికే ఎనిమిది విడతలుగా అభ్యర్థులను ప్రకటించి జగన్ రేసులో ముందు నిలిచారు. కానీ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఎంపీ అభ్యర్థుల ఎంపిక రెండు పార్టీలకు తీవ్ర తలనొప్పిగా మారింది. జనసేన ఎక్కువ సీట్లు కోరే జిల్లా. ఇటు టిడిపికి కూడా బాగా పట్టున్న జిల్లా. జనసేనకు టిక్కెట్లు ఇచ్చిన చోట ఉన్న టిడిపి నేతలను మరోచోట సర్దుబాటు చేయాలి. వాటిని బేరీజు వేసుకునే ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. కాబట్టి చంద్రబాబు ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది.

ఎంపీ టిక్కెట్‌పై ఎవరికి వారే ధీమా..

టిడిపిలో అధికారాల మార్పిడి చంద్రబాబు, లోకేశ్‌కే పరిమితం కాలేదు. మిగిలినచోట్ల సీనియర్లకు స్వస్తి చెప్పి పార్టీలో యువరక్తాన్ని ఎక్కించాల్సి ఉంది. అందుకే ఈసారి 40శాతం సీట్లు యువతకేనని మొదటి నుంచీ చెబుతున్నారు. దీంతో రాజకీయ వారసులు తమ అదష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అమలాపురం ఎంపీ టిక్కెట్ మాజీ లోక్‌సభ స్పీకర్ దివంగత బాలయోగి తనయుడు గంటి హరీశ్ మాథుర్ మరోసారి కోరుతున్నారు. గత ఎన్నికల్లో ఇదేస్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలైన ఆయన... ఈసారి ఎలాగైనా విజయం సాధించి తన తండ్రి అడుగుపెట్టిన పార్లమెంట్ గడప తొక్కాలని కంకణం కట్టుకున్నారు. అయితే పొత్తులో భాగంగా ఈ సీటు ఎవరికి ఇవ్వాలన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ ఎంపీ టిక్కెట్ ఇవ్వకున్నా.. అమలాపురం అసెంబ్లీ సీటు అయినా ఇవ్వాలని హరీశ్ కోరుతున్నారు. ఆయన తండ్రి బాలయోగి చేసిన సేవలు ఈ ప్రాంత ప్రజలు ఇంకా గుర్తుపెట్టుకున్నారు. ఆ సానుభూతితోనే గత ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చినా... వైసిపి వేవ్‌తోపాటు టిడిపి, జనసేన విడివిడిగా పోటీ చేయడం వల్ల ఓట్లు చీలిపోయి ఓటమిపాలయ్యారు. కానీ ఈసారి పరిస్థితులు అలా లేవని... కచ్చితంగా నెగ్గి తీరతామని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.

టిడిపి-జనసేనలో తీవ్రమైన పోటీ

హరీష్ బాలయోగి ఎంఎల్ఎ టిక్కెట్ అమలాపురం పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తారని చర్చలు నడుస్తున్నాయి. ఎన్నికల సమీపించే వరకు అభ్యర్థులు ఎవరనేది బయటకు తెలియనివ్వకుండా టిడిపి అధిష్టానం జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది.అమలాపురం టిక్కెట్ తనదేనని హరీష్ ధీమాగా ఉండగా కొత్త పేర్లు, అభ్యర్థులు తెరపైకి వచ్చారు. గోపవరానికి చెందిన మాజీ ఎంపీ బుచ్చిబాబు పెద్ద కుమార్తె పాము సత్యశ్రీ టిడిపిలో చేరారు. జిల్లా సీనియర్ నేతలతో కలిసి చంద్రబాబును కలిసిన ఆమె... అమలాపురం లోక్‌సభ సీటు ఆశిస్తున్నారు. రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబం కావడంతో ఆమె కూడా టిక్కెట్‌పై ధీమాగా ఉన్నారు. మహిళా కోటాలో తన పేరు పరిశీలించే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. ఎస్‌సి రిజర్వ్‌డు స్థానాల్లోనే పోటీ ఈస్థాయిలో ఉందంటే... ఓపెన్ కేటగిరిలో టిక్కెట్లు కేటాయింపు టిడిపికి కత్తిమీద సాములాంటిదే.జనసేన కూడా అమలాపురం ఎంపి టిక్కెట్ ఆశిస్తోంది. ఈ రేసులో 2019లో అమలాపురం ఎంపిగా పోటీచేసిన డిఎంఆర్ శేఖర్ మరలా అమలాపురం ఎంపీ స్థానం ఆశిస్తున్నారు.

వైసిపి ఎంపీ స్థానానికి ఎవరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముఖ్యకేంద్రం అమలాపురం వైసిపి ఎంపి అభ్యర్థి ఎంపిక ఇంకా పూర్తికాలేదు. ప్రస్తుత అమలాపురం ఎంపీ అనురాధకు టిక్కెట్ లేదని పార్టీ వర్గాల్లో విశ్వశనీయ సమాచారం. దీంతో ఇటీవల వైసిపిలో చేరిన గొల్లపల్లి సూర్యారావుకు ఎంపీ టిక్కెట్ ఇచ్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాదరావును ఎంపీగా పంపాలని పార్టీ చూడగా దానికి రాపాక సమూచితంగా లేక పోవడంతో గొల్లపల్లి స్యూర్యరావుకు టికెట్ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.గొల్లపల్లి సూర్యరావు అమలాపురం పార్లమెంట్ పరిధిలో అన్ని నియోజ కవర్గాల్లో సుపరిచితుడు కావడంతో తనే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వీటన్నిటి తెర పడాలంటే మరో కొద్దిరోజులు వేచిచూడాలి.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా తూముల పూడ్చివేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

శివల- దంగేరు రోడ్డు అభివద్ధి పనులు భాగంగా పంట కాలువ గల తూములు పూడ్చివేశారని దీంతో రైతులకు సాగునీరు అందడం లేదని కొనరేవుపాడు, శివల గురువారం ఆందోళన చేపట్టారు. శివల గ్రామం నుండి దంగేరు వరకూ మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించారు.అయితే శివల నుండి కొనరేవుపాడు మధ్యలో గల పంట కాలువ తూములు పదింటిని కాంట్రాక్టర్ పూడ్చి వేయడం వల్ల దాళ్వా రైతులు లకు సాగునీరు నిలిచి పోయింది.దీనితో రైతులు, మహిళలు మెయిన్ రోడ్డు పై ఆందోళన చేపట్టారు.వెంటనే పూడ్చి వేసిన తూములు పునరుద్ధరించా లని, సాగునీరు అందించాలని నినాదాలు చేశారు. ఈ విశయం తెలుసుకున్న వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఇళ్ళ సూర్య నారాయణ రైతులతో మాట్లాడిన అనంతరం రహదారి భవనాలు అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. వెంటనే పూడ్చివేసిన తూములు పునరుద్ధరించాలని రైతులకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు.



పూడ్చివేసిన పంట కాలువ వద్ద రైతుల ఆందోళన

చర్యలు చేపడతాం : ఆర్అండ్‌బి డిఇ

దీనిపై ఆర్ అండ్ బి డిఇ సూర్యనారాయణ మాట్లాడుతూ శుక్రవారం రైతులతో మాట్లాడి పూడుకుపోయిన తూములను తొలగించి ప్రత్యామ్నాయంగా తూముల ఏర్పాటుకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా లో పూర్తి వేసిన తూముల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి రైతులకు సాగునీరుద్ధరించాలని కోన రేవు పాడు రైతులు కోరుతున్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన

ప్రజాశక్తి-ఆలమూరు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు

పంటకోత ప్రయోగాలపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు విఎఎలతో అన్నారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలోని మండలాలకు చెందిన గ్రామ విఎఎలకు ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అలాగే మండలంలోని జొన్నాడలో ఆయన సిబ్బందితో క్షేత్రస్థాయిలో వరిలో వచ్చు తెగులు సమస్యలను అడిగి దానికి సంబంధించి సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. గ్రామ వ్యవసాయ సహాయ కులు పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పిం చారు. ఇందులో భాగంగా పంటకోత ప్రయోగాలు ఏవిధంగా చేయాలనే దానిపైనా, మన రాష్ట్రంలో ఎంత ధాన్యం ఎగుమతులు దిగుమతులు జరుగుతున్నాయో వాటి గురించి గురించి వివరించారు. ప్రతి గ్రామం నుంచి నాలుగు క్రాఫ్ కటింగ్ ప్రయోగాలు జరగాలన్నారు. వీటిపై ఆధారపడే రైతులకు క్రాఫ్ ఇన్సూరెన్స్ రావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిపిఒ పి.వెంకటేశ్వర్లు, ఎడిఎ కాకి నాగేశ్వరరావు, ఎఒ లు లక్ష్మీ లావణ్య, రమేష్ కుమార్, ఏసుబాబు, విఎఎలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలోని 24వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డును మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, మున్సిపల్ కమిషనర్ బి.రాము గురువారం పరిశీలించారు. ఇటీవల డంపింగ్ యార్డు విస్తరణకు కొనుగోలు చేసిన 2.75ఎకరాల స్థలాన్ని పరిశీలించి శానిటేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మున్సిపల్ ఛైర్ పర్సన్ 24వ వార్డులో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. ఈ కార్యక్రమంలో డిఇ కె. శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, మేస్త్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



24 వార్డులో డంపింగ్ యార్డు పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ రాణి, అధికారులు

పలుచోట్ల ఎన్నికల నిర్వహణపై అవగాహన

ప్రజాశక్తి-యంత్రాంగం

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి గురువారం పలుచోట్ల అధికారులు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు.

మండపేట మండపేట పట్టణంలోని గౌతమీ మున్సిపల్ పాఠశాల్లో దక్షిణం వైపు గ్రౌండ్ ఫ్లోరులో కొత్తగా ఏర్పాటైన 69వ పోలింగ్ కేంద్రంలో సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఎజెఎస్.శ్రీనివాస్, బిఎల్ఒ వై.రామకష్ణ తదితరులు ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పోలింగ్ స్టేషన్లో పరిధిలో 37 మంది పురుష ఓటర్లు ఉండగా 326 మంది మహిళా ఓటర్లు వారి ఓటు హక్కును విని యోగించుకోనున్నారన్నారు. **మామిడికుదురు** సార్వత్రిక ఎన్నికల్లో ఇవిఎం, వివి ప్యాట్‌ల పనితీరుపై మామిడికుదురు రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ మెరికమ్మ ఆధ్వర్యంలో అవగాహన కలిపించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి సమస్యలు ఏర్పడకుండా విధులు నిర్వహించాలన్నారు సుమారు వంద మంది మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పిం చారు. **ఆత్రేయపురం** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పురస్కరించుకుని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.వెంకట రామయ్య ఎన్నికలు విధులు నిర్వహించనున్న పిఒ, మరియు ఎపిఒలకు ఇవిఎంల నిర్వహణపై శిక్షణ కార్య క్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వర రావు, ఎంఇఒలు ప్రసాద రావు, పచ్చా సాహెబ్, మండల ఇవిఎం ట్రయినీ మాస్టర్ ఎస్.ప్రసాద్ మరియు మండలం లోని మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురు ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వివిధ విభాగాల్లో పనిచేసిన పలువురు ఉద్యోగులు గురువార ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారిని అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు.

ముమ్మిడివరం ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సమాచార పౌర సంబంధాల శాఖలో సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో పని చేసి డివిజనల్ పౌర సంబంధాల అధికారిగా పని చేసి పదవీ విరమణ చేస్తున్న ఎండి.విలాయత్ అలీ సన్మాన సభ గురువారం స్థానిక ఎయిమ్స్ కళాశాలలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యం లో సిబ్బంది పదవి విరమణ చేసిన విలాయత్ ఆలీని ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా డిఐపిఆర్ఒ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పాత్రికే యులకు అక్రిడేషన్ కార్డులు మం జూరులో డివిజనల్ పిఆర్ఒ విలాయత్ అలీ పూర్తి సహకారం అందించారన్నారు. సంయుక్త సమాచార కార్య నిర్వాహక ఇంజినీర్ కె శ్రీనివాస రావు మాట్లాడుతూ విలాయత్ ఆలీ విధి నిర్వ హణలో మంచి పేరు ప్రఖ్యాతులు గడిచారని తెలిపారు. ఈ సందర్భంగా పదవీ విరమణ చేసిన విలాయత్ ఆలీ మాట్లాడుతూ సమాచార శాఖలో విధులు నిర్వహించడం ఒక సవాలు గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజాప్రతినిధులు అధికారులు, సమన్వయం చేసుకుంటూ పాత్రికేయు లకు పూర్తిగా సహకరించి విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తనకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్ర మంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మి, టైపిస్టులు కె.భారతి శార్వాణి, కార్యాలయ రికార్డు అసిస్టెంట్ ఆర్ఎస్. కుమార్, కార్యాలయ సబార్డినేట్స్ ఎన్.చిట్టి రాజు ఎం.సతీష్ కుమార్, జి.రాజు విఘ్నేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **ఐ.పోలవరం** జి.మూలపొలం గ్రామ పంచాయితీ కార్యదర్శి పంపన వెంకటేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు అన్నారు.తాళ్లరేవు మండలం లచ్చిపాలెం గ్రామ పంచాయతీ బాపనపల్లి గ్రామం. వెంకటేశ్వరరావు గురువారం ఉద్యోగ విరమణ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 34ఏళ్ల సర్వీస్ కాలంలో తాళ్లరేవు, కపిలేశ్వరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలంలో ఉన్న లచ్చిపాలెం, టేకి, రాణేలంక, జి.వేమవరం, గుత్తెనదీవి, జి.మూలపొలం గ్రామ పంచాయతీలో విధులు నిర్వహించానని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఐ.పోలవరం మండలం పరిషత్ కార్యాలయం వద్ద వీడ్కోలు సభ నిర్వహించారు. వీరి కుటుంబసభ్యుల సమక్షంలో వెంకటేశ్వరరావు,కనకదుర్గ దంపతులను ఎన్ఆర్‌జిసి డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎంపిడిఒ అమిలు జమా, ఉద్యోగులు ప్రజా ప్రతినిధులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో ఎం.పి.పి.మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యులు ముదునూరి సతీష్ రాజు, వైసిపి జిల్లా జనరల్ సెక్రటరి రేవు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం జి.వేమవరం పిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ సూపర్ వైజర్ గా విధులు నిర్వహించిన వీరయ్య మాస్టారు సేవలు ప్రశంసనీయమని ఎపి ప్రభుత్వ ఉగ్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ,ప్రజా ఆరోగ్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొంతి అస్కారావు, జిల్లా అధ్యక్షులు ఎంవివి.సత్యనారాయణ, జి.వేమవరం పి.హెచ్.సి.ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి కె.ఇందిరాశ్రీ అన్నారు.గురువారం పినిపే వీరయ్య మాస్టారు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాస్టారు- వెంకటరమణ దంపతులకు వీరి కుటుంబసభ్యులు సమక్షంలో ప్రజా ప్రతినిధులు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు కార్యక్రమంలో ముందుగా వీరయ్య మాస్టారు విలేకర్లతో మాట్లాడుతూ 34ఏళ్ళు సర్వీస్ కాలంలో 1992లో తాళ్లరేవు మండలం జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ టీచర్‌ను, తాళ్లరేవు పిహెచ్‌స ఆసుపత్రి 1999లో హెల్త్ అసిస్టెంట్ గాను, 2010కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలోను, 2019గోకవరం, సీతానగరం, రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, ఐ.పోలవరం మండలంలో విధులు నిర్వహించాని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి.మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి.సభ్యులు ముదునూరి సతీష్ రాజు, ముమ్మిడివరం ప్రభుత్వ సూపరింటెండెంట్ డాక్టర్ డయానా,కేశనకుర్రు డాక్టర్ శివ గాయత్రి తదితరులుపాల్గొన్నారు.



ఐ.పోలవరం మండలం జి.మూలపాలెంలో వెంకటేశ్వరరావు, కనకదుర్గ దంపతులను సత్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు



ముమ్మిడివరంలో ఉద్యోగ విరమణ చేసిన అలీని సత్కరిస్తున్న జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది



ఐ.పోలవరం జి.వేమవరం పిహెచ్‌సిలో వీరయ్య మాస్టారు, వెంకట రమణ దంపతులకు సత్కారం



చింతలూరులో అన్న సమారాధన

ప్రారంభమైన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి -ఆలమూరు

చింతలూరు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు అయిదు రోజులపాటు నిర్వహించారు. పవిత్రోత్సవంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. పులిహారతో స్వామి రూపాన్ని ఏర్పరిచి అన్నకూటోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా జరిగిన అన్న సమారాధనలో యాత్రికులు పాల్గొన్నారు.

మహా గర్జన విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-మండపేట

రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగ హక్కులు సాధించడానికి వికలాంగుల చలో అమరావతి పేరుతో నిర్వహించే మహా గర్జనను విజయవంతం చేయాలని విహెచ్‌పిఎస్ జాతీయ కోర్ కమిటీ కో కన్వీనర్ అందె రాంబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ధర్మగుండం చెరువు వికలాంగుల భవనంలో నిర్వహించిన సభలో ఆయనతో పాటు మహజన సోషలిస్టు పార్టీ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ దూళి జయరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా హాలో వికలాంగులు చలో అమరావతి కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ మార్చి 9న అమరావతిలో వికలాంగుల మహాగర్జన సభ నిర్వహించబోతున్నామన్నారు. ఈ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి వికలాంగులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఎంఆర్‌పిఎస్, ఎమ్‌సిపి పార్టీల వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కష్ణ మాదిగ పిలుపు మేరకు అమరావతిలోని నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న గ్రౌండ్స్‌లో మహాగర్జన సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి -మామిడికుదురు

మామిడికుదురు హైస్కూల్ రోడ్డులో లక్ష్మీ గణపతి విగ్రహ, శిఖర ప్రతిష్ట గురువారం ఘనంగా జరిగింది. వాసంసెట్టి సత్యనారాయణ మూర్తి, కుమారులు వెంకట రమా కాంత్ బాబు, కవిత దంపతులచే గురువారం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

సాగులో ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి-ఆలమూరు

రైతులు సాగులో ఆధునిక శాస్త్ర పద్ధతులను అనుసరించి అధిగ దిగుబడి సాధించవచ్చునని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయము పరిశోధనా అధిపతి ఎన్.బి.వి.చలపతిరావు పేర్కొన్నారు. మండలంలోని చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ ఉద్యానవన పంటల్లో రైతులు ఆచరించే సేద్య పద్ధతులపై క్షేత్రస్థాయిలో వారు పరిశీలించారు. 4వ సంవత్సరం బిఎస్‌సి (హార్టీకల్చర్) కు చెందిన 16 మంది విద్యార్థులు గ్రామీణ ఉద్యానవన 110 రోజులు రీసర్చ్ ప్రణాళికలో భాగంగా వివిధ ఉద్యాన పంటలపై పురుగులు, తెగుళ్ల, పోషక లోపాలను గుర్తించి వాటి నివారణ, పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సైంటిస్టు వి.గోవర్ధన్ రావు, ఎమ్.కల్పనలు, ఉద్యాన అధికారి జి.కొటీశ్వరరావు, విహెచ్చుఎ లావణ్య పాల్గొన్నారు.

కోటిపల్లి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

కోటిపల్లి శ్రీ చాయ సోమేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా పిల్లి శ్రీనివాసరావు గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాలకవర్గ సభ్యులు గా గొడవర్తి రామకృష్ణ మొహమాటిశ్రీరాములు, పెమ్మాడి దుర్గా, ఓలేటి సాయి లక్ష్మి, అయినవిల్లి పద్మావతి, శీరం మాణిక్యం, తీపర్తి సత్యవేణి, జంధ్యాల శివ శంకర శర్మ నియమితులయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎంపిపి పంపన నాగమణి వైసిపి నాయకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ పద్మావతి, ఒదూరు దేవస్థానం ఇఒ, శ్రీనివాస, వైసిపి నాయకులు పంపన సుబ్బారావు, జుత్తుగ శ్యాంప్రసాద్, గోదావరి సూరిబాబు, దేవస్థానం అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రస్ట్ బోర్డు సభ్యులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

నిబంధనలతో ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి

ప్రజాశక్తి-కొత్తపేట

ఇంటర్మీడియట్ ఐ పి ఇ-2024 పరీక్షలను నియమ, నిబంధనలతో నిర్వహించాలని కొత్తపేట గవర్నమెంట్ జూనియర్ కళాశాల, స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల ల పరీక్షల నిర్వాహక అధికారులు సిఎస్‌లు, డిఒలు అన్నారు ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో సిఎస్ కె.రవికుమార్, డిఒ సిహెచ్.మల్లాదేవి ఇన్విజిలేటర్లతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు తమ పరీక్ష కేంద్రంలో గరిష్టంగా 323 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారందరూ జనరల్ ఇంటర్ విద్యార్థులని తెలిపారు. మార్చి ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల్లో కళాశాల ప్రిన్సిపల్ కట్టా నాగమోహన్ ఎసిఎస్‌గా వ్యవహరిస్తారు. కళాశాల్లో ఎసిఎస్ ప్రిన్సిపల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఎస్.సతీష్ రాజు, డిఒ నరసింహం మాట్లాడుతూ ఈ సెంటర్లో గరిష్టంగా 407 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వారిలో 313 మంది ఒకేషనల్ విద్యార్థులు కాగా 94 మంది జనరల్ విద్యార్థులు అని తెలిపారు. పరీక్షలు శాంతియుతంగా సక్రమంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని వారు కోరారు. **మండపేట** ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరాల పరీక్షలు మండపేట పట్టణంలోని 6 పరీక్షా కేంద్రాలలో శుక్రవారం నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు జరగనున్నాయి. స్థానిక ఏడిదరోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఆదిత్య, ఎంపిఎస్, విద్యావికాస్, విజ్ఞాన్, వైష్ణవి ఒకేషనల్ కాలేజీలలో మొదటి సంవత్సరం విద్యార్థులు 2360, రెండవ సంవత్సరం 1997 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

దశల వారీగా దేవాలయాల అభివృద్ధి : ఎంఎల్ఎ జగ్గిరెడ్డి

ప్రజాశక్తి-కొత్తపేట

దేవాలయాలను దశలవారీగా అభివృద్ధి పరుస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ ర్ల జగ్గిరెడ్డి అన్నారు కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామంలో శ్రీనివాసపురం లో రామాలయం ముందు రూ.5 లక్షలతో నిర్మించిన షెడ్డును ఆయన గురువారం ప్రారంభించారు. కార్యక్రమం లో ఆముడా ఛైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపిపి మార్గం గంగాధర్, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, వైసిపి మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు

కార్టూ'నిజం'



మీరు ఎగ్గొట్టినా.. బడా నేతల జాబితాలోకి రారులెండీ!!!

రహదారుల ఆధునికీకరణ పూర్తి

మంత్రి పినిపె విశ్వరూప్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో దాదాపుగా అన్ని రోడ్లను ఆధునికీకరణ పూర్తయిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపె విశ్వరూప్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని కార్పొరేట్ సామాజిక బాధ్యత ఎంపిపి నిధులైన రూ.46 లక్షల అంచనా వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన స్థానిక మండల ప్రజా పరిషత్ మొదటి అంతస్తు, ప్రాంగణ అభివృద్ధి పనులను మంత్రి, శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుడిపూడి భాగ్యలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలామణి రుద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల కాలంలో గ్రామాలలో ప్రభుత్వం సి ఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రారంభించామన్నారు. త్వరలో నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లా ప్రధాన కేంద్రంలో ట్రాఫిక్ రద్దీని అధిగమించే దిశగా నల్ల వంతెన, ఈదరపల్లి వద్ద నూతన వంతెనల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. మండల స్థాయిలో అభివృద్ధి, సంక్షేమ పనుల గురించి చర్చించి, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఏర్పాటైన పంచాయతీ రాజ్ సంస్థ మండల పరిషత్ అని ఆ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా భవనాలను ఆధునీకరించి అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోందన్నారు. స్థానిక స్వపరిపాలన, గ్రామీణ వ్యవస్థ బలోపేతానికి అభివృద్ధి కార్యక్రమాల అమలులో గ్రామాల మధ్య సమన్వయానికి మండల పరిషత్ కృషి చేస్తోందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో దిగువ, ఎగువ సంస్థలైన పంచాయతీలు, జిల్లా పరిషత్ కు అనుసంధాన కేంద్రంగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపిడిఒ జె.వెంకటేశ్వరరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం మొదటి అంతస్తు ప్రారంభోత్సవం లో పాల్గొన్న మంత్రి తదితరులు

నేరాలు ఘోరాలు

వేధిస్తున్న భర్త పై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని ర్యాలీ గ్రామానికి చెందిన వీరమల్ల పద్మావతికి రెండేళ్ల క్రితం తాళ్లపూడి మండలం అన్నదేవరపేటకు చెందిన వీరమల్ల మహేష్ నారాయణతో వివాహమైంది. అప్పట్లో కట్న కానుకలు, ఇతర లాంచనాలు ఇచ్చి ఆమెను పుట్టింటి వారు కాపురానికి పంపించారు. ఒకరు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇటీవల కాలంలో మహేష్ చెడు వ్యసనాలకు బానిసై భార్య పద్మావతిని అదనపు కట్నం తీసుకురావాలంటూ శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారు. వేధింపులు తాళలేక ఆమె గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ శ్రీనివాసు తెలిపారు.

కారు ప్రమాదంలో పలువురికి గాయాలు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం మండలం బండారులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి బీభత్సం సృష్టించింది. పలువురికి గాయాలయ్యాయి. వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాలను, తోపుడుబండ్లను ఢీకొట్టింది. దీంతో ప్రజలు పరుగులు తీశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. అమలాపురం తాలూకా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అచ్చియ్యపాలెం శివార్లలో సీతానగరం ఎస్ఐ సిబ్బందితో కలిసి సారా బట్టీలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 70 లీటర్ల నాటు సారా, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని, బట్టీ నిర్వాహకులు ఎవరనేది దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అనుమానంతో భార్య హత్య

ప్రజాశక్తి - కాకినాడ

అనుమానం పెనుభూతమై భార్యను కత్తితో నరికి హత్య చేసిన ఘటన స్థానిక జగన్నాథపురంలో గురువారం చోటు చేసుకుంది. కాకినాడ ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు జగన్నాథపురం పప్పుల మిల్లు ఏరియాలో బొంతాల నూకరాజు, తన భార్య దివ్య, ఇద్దరు పిల్లలతో కలిసి కాపురముంటున్నాడు. నూకరాజు బిల్డింగ్ కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల కాలంలో భార్య దివ్యపై నూకరాజు అనుమానం పెంచుకున్నాడు. ఇదే విషయమై గురువారం ఉదయం నూకరాజు, దివ్యల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో నూకరాజు ఆగ్రహంతో ఇంట్లో వాషింగ్ మిషన్ పక్కన ఉన్న కత్తిని తీసుకుని ఆమెపై దాడి చేశాడు. కేకలు పెడుతూ దివ్య భయటకు పరిగెడుతూ వచ్చి గేటు వద్ద కుప్పకూలి పోయింది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని సిఐ సురేష్ బాబు పరిశీలించారు. నూకరాజును అదుపులోకి తీసుకున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గోపాలపురం

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారు హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు మండలం కొత్తట గ్రామానికి చెందిన ఏనుగు అంజిబాబు (30) తాడేపల్లిగూడెం టిడిపి, జనసేన మహాసభకు వెళ్లి అక్కడి నుండి కొయ్యలగూడెం తన స్నేహితుడు ఇంటికి వెళ్లాడు. తిరిగి బైకుపై ఇంటికి వెళుతుండగా గోపాలపురం గ్రామ శివారు ఎన్‌హెచ్ రోడ్డులో హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలోకి వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీ కొట్టి ఆపకుండా వెళ్ళిపోయినట్లు తెలిపారు. తల వెనుక తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి ఏనుగు చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్ఐ సతీష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి-గోపాలపురం

రాష్ట్రంలో ప్రజల సంక్షేమానికీ, అభివృద్ధికీ సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని హోమ్ మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని సంజీవపురం, దొండపూడి, సగ్గొండ పంచాయతీల పరిధిలో నిర్మించిన సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బికె భవనాలను హోమ్ మంత్రి తానేటి వనిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం జగన్ ఆధ్వర్యంలోని ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకే పాలనను అందిస్తోందన్నారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ గ్రామ సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవా లన్నారు. తమది ప్రజల ప్రభుత్వం అని, ప్రజా సంక్షేమ ప్రభుత్వమని తెలిపారు. అవినీతికి కానీ వివక్షకు కానీ తావు ఇవ్వకూడదన్నదే తమ లక్ష్యమని చెప్పారు. సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. గ్రామస్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కరించి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. సంజీవపురంలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె, రేగులకుంటలో వైఎస్సార్ హెల్త్ సెంటర్, దొండపూడిలో ఆర్‌బికె, వైఎస్ఆర్ హెల్త్ సెంటర్, సగ్గొండలో గ్రామ సచివాలయం, ఆర్‌బికె కేంద్రాలను ప్రారంభించినటుట తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి - జగ్గంపేట

మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని సిఐ లక్ష్మణరావు తెలిపారు. పట్టణ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి అదుపులోకి తీసుకున్న వారిని పెద్దాపురం మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామన్నారు. నలుగురు వ్యక్తులకు మూడు రోజులు జైలు శిక్ష విధించగా, మరో ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున న్యామూర్తి జరిమానా విధించారన్లి సిఐ తెలిపారు.

టిడిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ఆధ్వర్యంలో పలుచోట్ల బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు పాల్గొని సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. **మండపేట** పట్టణంలోని 1వ వార్డు వీరభద్రాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ" కార్యక్రమంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి శ్రేణులతో కలసి ఇంటింటికీ పర్యటించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కరెంట్ బిల్లులు, నిత్యావసర సరుకుల ధరలు, రకరకాల పన్నులు ఇలా అన్నీ పెంచుకుంటూ పోతూ ప్రజల నడ్డి విరుస్తాడని అనుకోలేదని అన్నారు. కరెంటు బిల్లులు వీళ్లే పెంచి కరెంటు బిల్లు అధికంగా వస్తే పెన్షన్ కు, అమ్మవడి తీసేస్తామని వీళ్లే లింకుపెడతారన్నారు. సంక్షేమం పేరుతో ప్రజలను మోసం చేస్తూ, రాష్ట్రంలో అభివృద్ధి అనేదే లేకుండా పరిపాలన సాగిస్తున్న ఈ వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. **కొత్తపేట** మండలంలో కొత్తపేట శివారు ఏనుగులమహల్ లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీలో టిడిపి-జనసేన ఉమ్మడి అభ్యర్థి సత్యానందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడే మహాశక్తి పథకాలు మేలు చేయనున్నాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధి చెంది ప్రజాపాలన రావాలంటే రాష్ట్రంలో ఉమ్మడి పార్టీల ప్రభుత్వం ఏర్పడే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మందపల్లి, ఏనుగులమహల్ గ్రామాల టిడిపి, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



యువకునితో మాట్లాడుతున్న మండపేట ఎంఎల్‌ఎ వేగుళ్ల

యానాం వార్తలు

బాలికలను రక్షించాలని ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా 450 మంది ఆడపిల్లలతో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్‌ఎఒ మునిస్వామి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఆడపిల్లలను రక్షించాలని, వారిని చదివించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఎడిపిసి కమిడి ప్రభాకర్, పాము సత్యనారాయణ, సిఐ షణ్ముగం, ఎస్‌ఐలు మురుగన్, నూకరాజు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్

ప్రజాశక్తి - యానాం

భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్తంగా జిల్లాస్థాయి యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్లో నిర్వహించారు. జాతీయంగా, స్థానికంగా ఉన్న సమస్యలపై యువత ఆలోచన విధానం, పరిష్కరించుకునే విధానం, కేంద్ర ప్రభుత్వ పథకాలపై చర్చ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై యూత్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్‌ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ చింతపల్లి కృష్ణ సుధాకర్, జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, అధ్యాపకులు చెల్లి నరేష్, తిరికోటి సుబ్బలక్ష్మి, కళాశాల సిబ్బంది, వాలంటీర్లు, యువత పాల్గొన్నారు.

నోటిఫికేషన్‌కు ముందే ఎన్నికల ప్రచారం

ఇండిపెండెంట్ అభ్యర్థి రామరాజు

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఇంకా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ లేదు. అయినప్పటికీ ప్రచారాన్ని ప్రారంభించి అందరికంటే ముందు దూకుడు ప్రదర్శిస్తున్నారు ఇండిపెండెంట్ అభ్యర్థి రామరాజు. ఆయన పట్టణంలో పల్లెల్లోనూ ఆటోలను ఏర్పాటు చేసుకుని ఎన్నికల ప్రచారం ముందుగానే ప్రారంభించి అందర్నీ ఆశ్చర్యానికి గురి చేశారు. 2019లో ఇండిపెండెంట్ ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసిన రామరాజు రామచంద్రపురం పట్టణం,18 వ వార్డు, కవల వారిసావారంలో నివాసం ఉంటారు. గత ఎన్నికల వరకు ఆయన కాంగ్రెస్ పార్టీలో కొనసాగారు. తరవాత పలు ప్రజా సమస్యల పైనా, అక్రమ ఇసుక తవ్వకాలపై పైన, పట్టణంలో పలు ఆక్రమణలు పైన, సమైక్యాంధ్ర ఉద్యమంలోనూ, రామచంద్రపురం నియోజకవర్గం కాకినాడ జిల్లాలో ఉంచాలంటూ కొనసాగిన ఆందోళన లోనూ ఆయన పాల్గొన్నారు. పలు ప్రజా సమస్యలపై ఆయన స్వయంగా హైకోర్టులో పోరాటాలు కొనసాగించారు. ప్రస్తుతం జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు మళ్లీ ఎంఎల్‌ఎ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.



పట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి ఆటో

పోలీస్ బలగాల ఏర్పాట్లపై పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణంలో శనివారం ఎన్నికల పోలీస్ బలగాల పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఎస్‌పి శ్రీధర్ రామచంద్రపురం డిఎస్‌పి రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ బి.రాము, టౌన్ సీఐ షేక్ అఖిల్ జమ, టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రిలతో కలిసి గురువారం పరిశీలించారు. అయ్యప్ప స్వామి ఆలయం సమీపంలోని శెట్టిబలిజ కళ్యాణ మండపాన్ని ఆయన పరిశీలించి అక్కడ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.



ఏర్పాట్లు సమీక్షిస్తున్న ఎస్‌పి

సమస్యలు పరిష్కరించాలని ఆందోళన

ప్రజాశక్తి - పెద్దాపురం, ఏలేశ్వరం

ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్య లు వెంటనే పరిష్కరిం చాలని కోరుతూ ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యా యులు ఏలేశ్వరం తహశీ ల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎన్.ఫిలిప్‌రాజు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో మంజూరు కావడం లేదని, బకాయిలు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నదని తెలిపారు. తక్షణమే ఆర్థిక పరమైన అంశాలను పరిష్కరించాలని, అలాగే ఉపాధ్యాయుల నియామ కంలో ప్రవేశపెట్టిన అప్రెంటిస్ విధానం రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విటియు ఆచార్యులు, పి సత్తిబాబు, ఎన్‌ఎల్‌ఎన్.రాజు, పిఎస్.వాణి, ఆర్‌ఎస్.రాజు, కె.సత్యవతి, ఆర్ కుమారి, ఎ.లలిత పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం తహశీల్దార్ కార్యాల యం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ మధ్యంతర పిఆర్‌సి కింద 30 శాతం చెల్లించాలని, ఒపిఎస్ విధానం కొనసాగించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బి.సత్యప్రసాద్, డి.ఎ.రాజశేఖర్, శ్రీరామ్, ఎ.సురేష్, కెసి.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ సైన్స్ విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం డిఎస్‌పి కె.ప్రమోద్, విశాఖపట్నంలోని ఆంధ్రా మెడికల్ కాలేజీ నుంచి డాక్టర్ ప్రమోద్ కుమార్ పాల్గొని విజ్ఞాన శాస్త్రం యొక్క గొప్పతనాన్ని, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ సీన్, క్విజ్, డ్రాయింగ్, షార్ట్ ఫిలిం పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ విలాస్ అనిల్ చవాన్, వైస్ ప్రిన్సిపల్ నాగేశ్వర రావు, మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రిన్సిపల్ సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

గుమ్మిలేరులో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పూర్తి

ప్రజాశక్తి- ఆలమూరు

గుమ్మిలేరు గ్రామంలో 132 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలతో పాటుగా స్థలాలు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందనిఆ గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలో ఈ గ్రామంలోనే సుమారు 40 ఎకరాల్లో ఈ గ్రామ లబ్ధిదారులతో పాటుగా మండల పరిధిలో 12 గ్రామాల్లో గల లబ్ధిదారులకు 1100 మందికి ఇళ్ళ స్థలాల పట్టాలు అందించి, గ్రామాల వారీగా సంప్రదాయబద్ధంగా స్థలాలు చూపించే కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మోక్షాంజలి, పద్మావతి, విఆర్‌ఒ అమ్మాజీ, డిఎ వందన, లబ్ధిదారులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సర్పంచ్ రాంబాబుకు ఇళ్ల స్థలాల పట్టాలు చూపిస్తున్న లబ్ధిదారులు

పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి- కడియం

పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు.

కడియపులంకలో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ స్వీయ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రక్షణ గోడను మంత్రి వేణు, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి, జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పల్ల వెంకన్న నర్సరీరంగంలోనూ రాజకీయాలోనూ రాణిస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు విస్తరించారన్నారు. ఆయన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా పల్ల సత్యనారాయణ, సుబ్రహ్మణ్యం గణపతులు విశేష అభివృద్ధి పనులు చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్గాని సత్యనారాయణ, తిరుమల శెట్టి శ్రీనివాస్, ఊటుకూరి శైలజ, తాడాల చక్రవర్తి, బోడపాటి సత్యనారాయణ, పల్ల వెంకన్న చారటీబుల్ ట్రస్ట్ సభ్యులు పాట శెట్టి శ్రీనివాస్ చక్రవర్తి, పల్ల వెంకటేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - కాకినాడ

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే సత్సంకల్పంతో రెడ్‌క్రాస్ సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు స్ఫూర్తిదా యకమని జెసి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో గురు వారం ప్రకృతి వైపరీత్యాలు, అగ్నిప్రమా దాలు సంభవించే సమయాల్లో తీసుకో వలసిన రక్షణ చర్యలపై ఒఎన్‌జిసి సహకా రంతో సచివాలయ ఉద్యోగులు, రెడ్‌క్రాస్ ప్రాణమిత్ర వాలంటీర్స్‌కు శిక్షణా కార్య క్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న వారిని ఆదుకో వాలనే దక్పదాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చు కోవాలని సూచించారు. జీవన గమనంలో సేవ అన్నది ఒక అలవాటుగా మార్చుకో వాలన్నారు. ప్రధానంగా రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. నగరపాలక సంస్థ కమిష నర్ జె.వెంకటరావు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సంస్థ ఎన్నో ప్రజాప్రయోజన ప్రాజెక్టులను అమలు చేస్తోందని అభినందించారు. ఒఎన్‌జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుపమ్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమా లలో రెడ్‌క్రాస్ ఎంతో సేవా స్ఫూర్తితో పని చేస్తోందని, ఆ సంస్థకు తమ వంతు తోడ్పా టు ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడి.రామారావు మాట్లా డుతూ రక్తదాన శిబిరాలతోపాటు, వృద్ధాశ్రమాలు నిర్వహణ సహా ఎన్నో సేవా కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని, ఇందుకు ప్రెసి డెంట్ ఆఫ్ ఇండియా గోల్డ్‌మెడల్ కూడా సాధించామన్నారు. అలాగే రెడ్‌క్రాస్ సేవ ల్లో రాష్ట్రంలో కాకినాడ జిల్లా ప్రథమ స్థానం లో ఉందన్నారు. శిక్షణ పొందిన ప్రాణమిత్ర వాలంటీర్లకు సర్టిపికెట్లు అందజేశారు.

70 పుష్‌కార్ట్స్ సమకూర్చిన ఒఎన్‌జిసి

కాకినాడ నగరపాలకసంస్థ ప్రజారోగ్య విభాగానికి రూ.10 లక్షలు వ్యయంతో 70 పుష్‌కార్ట్స్‌ను ఒఎన్‌జిసి సంస్థ సమకూర్చింది. వీటిని జెసి ప్రవీణ్ ఆదిత్య నగరపాలక సంస్థకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రాణమిత్ర వలంటీర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాను ఉద్దేశించి తాటిపాక మధు, కుంద్రపు రాంబాబు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందే ప్రభుత్వ ఆర్థిక సాయం మంజూరు కావడం లేదని, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారుగా రూ.ఐదు కోట్ల క్లెయిమ్స్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. భవన నిర్మాణ కార్మికుల రూ.కోట్లాది నిధులను సంక్షేమ పథకాలకు మళ్లిస్తూ కార్మికులకు మొండి చేయి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు పోరాట ఫలితంగా ఏర్పడిన సంక్షేమ బోర్డును ఆనాటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సరిగ్గా అమలు చేశారని, నేటి ముఖ్యమంత్రి బోర్డుకు తూట్లు పొడిచారని చెప్పారు. నిర్మాణరంగంలో సెస్ రూపంలో వసూలు చేస్తున్న నిధులను కార్మికులకు ఖర్చు చేయాలని, ప్రభుత్వం వాడుకున్న రూ.కోట్లాది నిధులు తిరిగి సంక్షేమ బోర్డుకు చెల్లించాలని, ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.కొండలరావు, సప్పా రమణ, కె.శ్రీనువాస్, చింతలపూడి సునీల్, నల్లా రామారావు, టి.నాగేశ్వరరావు, ఎం.సాగర్ పాల్గొన్నారు.

ఓటు హక్కుకు ఎంతో విలువ

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, ఆ ఓటును సమర్ధవంతంగా వినియోగించుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావణి అన్నారు. స్థానిక పెంకేవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఎన్నికల ఓటింగ్ విధానంపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రంలో ఓటింగ్‌పై అవగాహన కల్పించేలా తల్లులతో రంగవల్లులు వేయించారు. అనంతరం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ప్రజలందరూ ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమ సమాజం ఏర్పడాలంటే రాబోయే ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

దంతాల పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో దంతాల సంరక్షణ మరియు పరిశుభ్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కెజెసిఎల్.స్వరూప దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవిశంకర్ మాట్లాడుతూ దంతాల యొక్క పరిశుభ్రత చాలా అవసరమని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వరూపను సత్కరించారు.

పరివర్తనా కేంద్రాలుగా జైళ్లు

సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరంరూరల్

గతంలో జైళ్లు కఠిన శిక్షలకు కేంద్రాలుగా ఉండేవని, ప్రస్తుతం అవి పరివర్తనా కేంద్రాలుగా మారాయని ప్రముఖ సామాజిక విశ్లేషకులు మలసాని శ్రీనివాస్ అన్నారు. సెంట్రల్ జైలులో జైలు సూపరింటెండెంట్, ఎస్.రాహుల్ ఆధ్వర్యంలో గురువారం ఖైదీలకు సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. జైలు డిప్యూటీ సూపరెంటిండెంట్ ఎం.రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మలసాని మాట్లాడారు. ఖైదీలకు మానసిక శిక్షణా కార్యక్రమాన్ని ఇచ్చారు.

మానవ విలువలు పెరిగిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా జైళ్లు పరివర్తనా కేంద్రాలుగా మారాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వెలువడిన ఎన్నో అద్భుత గ్రంథాలు చాలా మంది జైల్లో ఉండి రాసినవే అని ఆయన అన్నారు. ఖైదీలు జైల్లో చదువుకుంటూ, గ్రంథాలయాలను వినియోగించుకుంటూ, జైల్లో ఇచ్చే పలు రకాల శిక్షణలను సద్వినియోగం చేసుకుంటూ విడుదల అయిన తర్వాత మంచి పౌరులుగా, సమాజ మార్గదర్శకులుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు పలువురు మానసిక ఖైదీలకు వ్యక్తిగత కౌన్సిలింగ్ ఇచ్చారు. జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజ్‌కుమార్ మాట్లాడుతూ జైలులో ఖైదీల కోసం నిర్వహిస్తున్న పలు రకాల శిక్షణలు గురించి వివరించారు. అనంతరం ఖైదీలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జైలు వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్.శ్రీనివాసరావు, జైలు ఉపాధ్యాయులు చిలుకూరి శ్రీనివాసరావు తదితర సిబ్బంది పాల్గొన్నారు.